సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం | 17 | నవంబర్ | 2023



రూ.51,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శిష్లా కృష్ణకుమార్ (పి.గన్నవరం మండలం నరేంద్రపురం) గురువారం రూ.51,116 విరాళం సమర్పించారు.



సామాజిక న్యాయ సారథి.. జగన్

అన్ని సామాజిక వర్గాల్లో వివక్షకు గురైన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో న్యాయం జరిగిందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు గురువారం 7,000 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): 'వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం ఉదయం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీమోటర్ కార్స్‌లో టెలికాలర్స్, సేల్స్ ఎక్జిక్యూటివ్,ఫైనాన్స్ మేనేజర్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు విద్యార్హతల సర్టిఫికెట్స్ జెరాక్స్‌ల తో హాజరు కావాలన్నారు. వివరాలకు 7660823903 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

సంయుక్త బ్యాంకు ఖాతాలు తప్పనిసరి



సందీప్, సాంఘిక సంక్షేమశాఖాధికారి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం కోసం లబ్ధిదారులందరూ తల్లి పేరుతో కలిపి సంయుక్త బ్యాంక్ ఖాతాలు ఈనెల 24వ తేదీ లోగా మార్చుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ గురువారం ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకూ పథకం ఆర్థిక లబ్ధిని తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారని, ఇకపై విద్యార్థులు తమ తల్లితో పాటు సంయుక్త ఖాతా తెరవాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రారంభించే ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుగా, తల్లి ద్వితీయ ఖాతాదారుగా ఉండాలన్నారు. 2023 - 24 విద్యా సంవత్సరంలో చివరి సంవత్సరం చదువుతున్న అన్ని కేటగిరీల విద్యార్థులకు ఉమ్మడి ఖాతా అవసరం లేదని స్పష్టం చేశారు. ఈనెల 24వ తేదీలోగా సంయుక్త బ్యాంకు ఖాతాలను తెరవాలని, తెరచిన ఖాతా వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో సంక్షేమ, విద్యా సహాయకులకు అందజేయాలన్నారు.

ఓటర్ల దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి గురువారం ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, డీఆర్‌ఓ నరసింహులు..నియోజక వర్గ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల ద్వారా వచ్చిన 7,061 అభ్యంతరాలను పరిష్కరించామన్నారు. డూప్లికేట్ ఓట్లు 572, చిరునామా మార్పు కోరిన 716 , మరణించిన ఓటర్ల 5,773 మందికి సంబంధించి పరిష్కరించామన్నారు. జాబితాపై క్లయిములు..అభ్యంతరాలపై దరఖాస్తుకు డిసెంబర్ 9 చివరి తేదీ అని పేర్కొన్నారు. వాటిని డిసెంబర్ 26 లోగా పరిష్కరించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఒకే చిరునామా కింద పదికి మించి ఉన్న 1,196 గృహాల్లో 14,791 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిలో 10,985 మంది ఓట్లు సరైనవిగా గుర్తించామన్నారు. 3,761 మంది చిరునామా మార్పు కోరారన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య అండర్‌-17 బాలురు, బాలికల ఖో-ఖో పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ ప్రారంభించారు. పాఠశాల క్రీడా సమాఖ్య అండర్‌-17 ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 18 వరకు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 340 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడాధికారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, ప్రధానోపాధ్యాయులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన అశేష జనంలో ఓ భాగం

కొత్తపేటలో జనగోదారి

- సాధికార బస్సు యాత్రకు నీరాజనం
- వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- రావులపాలెం నుంచి భారీగా ర్యాలీ
- మార్మోగిన 'జై జగన్' నినాదాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పిస్తున్న సామాజిక న్యాయాన్ని వివరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

ఇటు గౌతమీ గోదారి.. అటు వశిష్ట గోదారి.. ఈ రెండు పాయల మధ్యన ఉన్న కొత్తపేటలో జనగోదారి పరవళ్లు తొక్కింది.. సామాజిక న్యాయాన్ని అందిస్తున్న సీఎం జగన్‌కు దిక్కులన్నీ ప్రతిధ్వనించేలా 'జై' అంటూ నినదించింది.. సాధికారతకు సై అంది.. వరదల వేళ ఇరు తీరాలనూ ఒరుసుకుంటూ ప్రవహించే గోదారిలా.. కోనసీమ అంతటా పరవళ్లు తొక్కే పంట కాలువల్లా.. వివిధ ప్రాంతాల నుంచి జనం చిన్నచిన్న ప్రవాహాల్లా కదిలి.. కొత్తపేటలో పోటెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే తొలిసారిగా జరిగిన వేళ.. అశేషంగా ప్రజానీకం తరలివచ్చారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున. వేదికపై ప్రజాప్రతినిధులు

సాక్షి, అమలాపురం/కొత్తపేట/రావులపాలెం: గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమకు అందిస్తున్న సంక్షేమానికి.. చేస్తున్న సామాజిక అభివృద్ధికి.. తమ ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేందుకు తీసుకుంటున్న చర్యలకు అశేష జనవాహిని జై కొట్టింది. వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన కొత్తపేటలో జరిగిన బహిరంగ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాల వారితో పాటు అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని, పెద్ద పెట్టున 'జై జగన్' నినాదాలు చేస్తూ, ఉత్సాహంగా కదలి వచ్చారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో రావడం గమనార్హం. అశేషంగా వచ్చిన జనంతో రోడ్లు నిండిపోయాయి. నిర్ణీత సమయంకన్నా రెండు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైనప్పటికీ మొక్కవోని దీక్షతో సభాస్థలిలోనే వేచి ఉన్నారు.

రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు బస్సు ఎక్కి యాత్రను ప్రారంభించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి మోటార్ సైకిళ్లపై వేలాదిగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు బస్సు వెంట బయలుదేరారు.

'అబద్ధాల చంద్రబాబు మనకొద్దు'

జనసందోహాన్ని ఉద్దేశించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వాటి వల్ల జిల్లా ప్రజలకు చేకూరిన లబ్ధిని గణంకాలతో వివరించారు. ఈ పథకాలు కొనసాగాలంటే ఆయా వర్గాలన్నీ కలసి కట్టుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందని చెప్పారు. పలు సందర్భాల్లో ఆయా వర్గాలకు చంద్రబాబు చేసిన అన్యాయాన్ని గుర్తు చేయడంతో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. 'అబద్ధాల చంద్రబాబు మనకొద్దు' అంటూ సభికులతో నినాదాలు చేయించారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఎగవేత, 642 హామీలకు గాను 42 మాత్రమే అమలు చేయడాన్ని గుర్తు చేశారు. 'ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచించండి' అంటూ నేతలు చేసిన ప్రసంగాలు సభికులను ఆలోచింపజేశాయి. జిల్లాలో తొలిసారి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడం పార్టీ వర్గాల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా ప్రసన్నకుమారి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కొప్పన శివనాగు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సుభాష్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

100 శాతం హామీలు నెరవేర్చింది జగన్ ఒక్కరే



ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేయడం, గెలిచిన తరువాత మరచిపోవడం **సర్వసాధారణం. ఈ దేశంలో** 100 శాతం ఎన్నికల హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ **ఒక్కరే. చంద్రబాబు అధి**కారం నుంచి దిగిపోయిన సమయానికి తక్షణం తీర్చాల్సిన రూ.80 వేల కోట్ల అప్పు ఉంచారు. ఇప్పుడు అప్పులంటూ గగ్గోలు పెడుతున్నారు. దేశంలో రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తున్నది జగన్ ఒక్కరే. ప్రతి ఒక్కరూ ఆయనకు ఓటుతో మద్దతుగా నిలవాలి.

– పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాజ్యసభ సభ్యుడు

జగన్ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత



ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా సాధికారత కల్పించింది. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరింది. దాదాపు అన్ని పథకాలూ మహిళల పేరిట అమలు చేసి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు.

– చింతా అనురాధ, ఎంపీ, అమలాపురం

ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఎస్సీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. అత్యధిక శాతం నిధులు ఎస్సీలకే ఖర్చు చేస్తున్నారు. కోవిడ్ సమయంలో జగన్ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు, సరఫరా చేసిన వ్యాక్సిన్, అందించిన పోషకాహారం రాష్ట్రంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడింది.

– పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్సీ

బీసీ పక్షపాతి జగన్



గతంలో ఏ ప్రభుత్వమూ కల్పించని విధంగా బీసీలకు రాష్ట్రంలో అన్నింటా ప్రాధాన్యం ఇచ్చి బీసీల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. రాజకీయంగా, సామాజికంగా నామినేటెడ్ పదవులు ఇచ్చి, గుర్తింపు కల్పించారు.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

ఆదర్శ సీఎం జగన్



రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో సీఎం జగన్ పని చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు జగన్ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ



సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ర్యాలీగా తరలివెళుతున్న ప్రజానీకం

యాత్రా విశేషాలు

- రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన సామాజిక సాధికార బస్సు యాత్రకు దారి పొడవునా మహిళలు హారతులు పట్టారు.
- యువకులు కేరింతలు కొడుతూ 'జై జగన్' నినాదాలతో యువకులు నిర్వహించిన బైక్ ర్యాలీపై దారి పొడవునా స్థానికులు పూలవర్షం కురిపించారు.
- రావులపాలెం జూనియర్ కళాశాల జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై రెండు భారీ క్రేన్ల సాయంతో భారీ గజమాల వేసి బస్సు యాత్రకు ప్రజలు స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి హైవే మీదుగా రావులపాలెం కళా వెంకట్రావు సెంటరుకు చేరుకున్న బస్సు యాత్రకు కోనసీమ ముఖద్వారం వద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు భారీ కొబ్బరి బొండాల దండతో స్వాగతం పలికారు. ఈ మాలను రెండు క్రేన్ల సాయంతో బస్సుపై ఉన్న నాయకులకు అలంకరించారు.
- అనంతరం భారీ ర్యాలీతో కొత్తపేట వైపు సాగిన బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగున హారతులు ఇచ్చి బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. కొమరాజులంక, పెంకులపాడు గరువు, మందపల్లి, ఏనుగుల మహల్ సెంటర్, షిర్డీ సాయిబాబా గుడి జంక్షన్ వద్ద బస్సు యాత్రకు మహిళలు హారతులు పట్టారు. అక్కడి నుంచి బోడిపాలెం మీదుగా కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌కు యాత్ర చేరుకుంది.
- సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందనే సమాచారంతో మధ్యాహ్నం నుంచే కొత్తపేట సందడిగా మారింది.
- పట్టణం మూడువైపులా భారీ ముఖద్వారాలు, స్వాగత హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, జెండాలతో అంతటా పండగ వాతావరణం తలపించింది.
- సభ ప్రారంభానికి ముందు వేదికపై ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, చిర్ల సోమసుందర్‌రెడ్డి విగ్రహాలకు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- సభ ముగిసే వరకూ ఆ ప్రాంగణమంతా 'జై జగన్' నినాదాలు హోరెత్తిపోయాయి.
- జగన్ చిత్రంతో కూడిన ఫేస్‌మాస్క్‌లు ధరించిన మహిళలు, వైఎస్సార్ సీపీ జెండాలతో నృత్యాలు చేశారు.
- జగనన్న పాటలతో ఆర్కెస్ట్రా ఆర్టిస్టులు హుషారెత్తించారు.

బడుగులకు పెద్దపీట



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర క్యాబినెట్ వరకూ అన్ని స్థాయిల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పదవులు కేటాయించి, గుర్తింపు తీసుకువచ్చింది. అణగారిన వర్గాలను గుండెల్లో పెట్టుకున్న వారికి అన్ని విధాలా ఆర్థిక లబ్ధి చేకూర్చారు. 'నా వల్ల లబ్ధి పొందితేనే నాకు ఓటు వేయండ'ని ధైర్యంగా చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగనే.

– చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే, కొత్తపేట

సంక్షేమంతో ప్రజాభిమానం పొందారు



కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా జగన్ ప్రజాభిమానం పొందారు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం



గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం కల్పించారు. జగన్ గురించి మాట్లాడుకోవడం అంటే పేదలు తమ గురించి మాట్లాడుకోవడమే.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

నరేంద్రపురంలో జనసేన, టీడీపీలకు షాక్

- సర్పంచ్‌తోపాటు 250 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక
- స్వాగతం పలికిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌లు



జనసేన, టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జక్కంపూడి రాజా, అనంత ఉదయ్‌భాస్కర్‌లు

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో జనసేన, టీడీపీలకు గట్టి షాక్ తగిలింది. ఆ గ్రామ సర్పంచ్ తంగెళ్ల ముసలయ్య సహా 250 మంది ఉభయ పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌లు పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. వీరి రాకతో ఆ గ్రామంలో జనసేన, టీడీపీల ప్రభావం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్టైంది. అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను అందిస్తున్నారని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపారని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. ఈ కారణంగానే జనసేన, టీడీపీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ప్రస్తుత సమయంలో రాష్ట్రానికి కావలసింది యువ నాయకుల సారథ్యమన్నారు. వయస్సు మళ్లిన వారు కాదన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి తిరుగేలేదన్నాన్నారు. అందుకు తమ వంతు కృషి చేస్తామని సర్పంచ్ తంగెళ్ల ముసలయ్య, తదితరులు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో గ్రామంలో రూ. 50 లక్షల మేర అభివృద్ధి జరిగితే ఎమ్మెల్యే రాజా నేతృత్వంలో రూ. 8.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, నరేంద్రపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

కులగణనపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

- హాజరుకానున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు
- రాజమహేంద్రవరంలో మధ్యాహ్నం మూడింటి నుంచి ప్రారంభం

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులగణనకు నాంది పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నేలపర్తిపాడులో ప్రతిష్టాత్మకంగా కులగణన ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు, వివిధ కులాల కార్పొరేషన్ డైరెక్టర్లతో రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జరిగే ఈ భారీ స్థాయి కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు, మేధావులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో అన్ని కులాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రక్రియలో మేధావి వర్గం, కుల సంఘాల నాయకులు తమ సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సీపీఓ ముఖలింగం ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సమావేశంలో సుమారుగా 30 మందికి ప్రసంగించి, తమ సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు సమావేశానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

క్లుప్తంగా

ఉద్యోగావకాశాలకు రిజిస్ట్రేషన్లు చేసుకోండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగావకాశాలకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి ఎన్.నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జూనియర్ కళాశాలలను హెచ్‌సీఎల్ టెక్‌బీ బృందాలు సందర్శిస్తాయని, వారు ఇంటర్ తర్వాత డిగ్రీ విద్యతో పాటు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొని, రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను నరసింహం ఆదేశించారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని, తమ పిల్లలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని కోరారు.

సామాజిక న్యాయ సారథి.. సీఎం జగన్

- అన్ని వర్గాలకూ మేలు చేశారు
- ఆయనకు మరోసారి మద్దతు ఇవ్వాలి
- బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణు



'రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, రాజ్యసభ సభ్యుడు బోస్, అముడా చైర్మన్ దేవిడ్‌రాజు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు

రావులపాలెం: అన్ని సామాజిక వర్గాల్లో వివక్షకు గురైన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా రావులపాలెం జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సామాజికంగా సాధికారతను చేకూర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని గుర్తు చేశారు. ఎవరైనా ఎస్సీల్లో పుడతారా అంటూ ఎస్సీ వర్గాలను చులకన చేస్తూ మాట్లాడారని చెప్పారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలు చంద్రబాబు పాలనలో వివక్షకు గురయ్యారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన ఓటును ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇస్తే.. ఆయన తన నాలుగున్నరేళ్ల పాలనలో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, నివాసపరంగా ఆత్మాభిమానం చాటుకునేలా అన్ని వర్గాలకూ స్థానం కల్పించారని చెప్పారు.

తోకలు కత్తిరిస్తానన్న చంద్రబాబు

''ఒక నాయీ బ్రాహ్మణ వ్యక్తి ఆలయాల్లో ప్రాతినిధ్యం కల్పించమని కోరితే 'మీ తోకలు కత్తిరిస్తాను' అని చంద్రబాబు అన్నారు. మత్స్యకారులు రిజర్వేషన్లు కల్పించాలని అడిగితే తోలు తీస్తానని చెప్పకనే చెప్పాడు. ఇలా వివిధ వర్గాల పట్ల చంద్రబాబు తన భావజాలాన్ని బయట పెట్టాడు'' అని మంత్రి వేణు గుర్తు చేశారు. నాటి చంద్రబాబు పాలనలో వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్ర వర్ణాల్లో వివక్షకు గురైన ప్రతి ఒక్కరికీ గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి చూపారని చెప్పారు. వారికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఫలాలను డీబీటీ పద్ధతిలో నేరుగా అందించి, నిజమైనా సామాజిక న్యాయం చేసి చూపించారని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఇచ్చిన ఓటు హక్కును ఈ సామాజిక వర్గాలు వినియోగించుకుని, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని, తద్వారా సంపన్న వర్గాలతో సమానంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఈ సామాజిక వర్గాలకు శాసనసభ సభాపతి, శాసన మండలి చైర్మన్ పదవులతో పాటు మంత్రివర్గ కూర్పులో 75 శాతం అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అలాగే జిల్లా పరిషత్ స్థానాల్లో 90 శాతం, అలాగే మార్కెటింగ్ కమిటీలు, దేవాలయాల కమిటీల్లో 55 శాతం అవకాశం కల్పించారని అన్నారు. తద్వారా అసలైన సామాజిక న్యాయాన్ని సీఎం జగన్ అమలు చేసి చూపించారన్నారు.

ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడి 14 ఏళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అనేక విధాల వివక్షకు గురయ్యారని చెప్పారు. వారందరికీ సముచిత స్థానం కల్పించడం ద్వారా సామాజిక సాధికారత అంటే ఏమిటో సీఎం జగన్ చేసి చూపారని అన్నారు. అన్ని వర్గాలకూ సరైన సామాజిక న్యాయం చేకూర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మరోసారి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం 'రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను నాయకులు ఆవిష్కరించారు. విలేకర్ల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పన రవి, అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐతో నన్నయ వర్సిటీ ఒప్పందం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ)తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సీటీఆర్ఐ సెమినార్ హాలులో గురువారం జరిగిన కార్యక్రమంలో సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్, నన్నయ వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ సంతకాలు చేసి, ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ, ఈ ఎంఓయూ ద్వారా సీటీఆర్ఐ, నన్నయ వర్సిటీ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. విద్య, పరిశోధన ప్రాజెక్టులు తదితర అంశాల్లో సంయుక్తంగా పని చేయడానికి ఈ ఒప్పందం దోహద పడుతుందన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ, ఈ ఒప్పందం ఇరు సంస్థలకు, సమాజానికి ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికే తమ వర్సిటీ, జేఎన్‌టీయూకే, ఎన్ఐటీ (తాడేపల్లిగూడెం), డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కలిసి క్లస్టర్ యూనివర్సిటీగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. సీటీఆర్ఐ ఆధ్వర్యాన నన్నయ వర్సిటీ వేదికగా త్వరలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ మాట్లాడుతూ, నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధిని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధిక అనుబంధ కళాశాలలతో లక్ష మందికి పైగా విద్యార్థులతో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ రమణేశ్వరి, ఆచార్య కె.రమేష్, ఆచార్య పి.సురేష్‌వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్ పెర్సిస్, డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సీటీఆర్ఐ విభాగాధిపతులు డాక్టర్ కె.సరళ, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, డాక్టర్ హెచ్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

అబ్బే.. నాకొద్దు..

- అన్నవరం ఈఓగా చేరేందుకు ఏడీసీ రామచంద్ర మోహన్ అయిష్టత?
- రిలీవ్ అయిన చంద్రశేఖర్ ఆజాద్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా డెప్యూటేషన్‌పై జాయిన్ అయ్యేందుకు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రామచంద్ర మోహన్ అంతగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేస్తున్న ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌ను శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ చేసి, ఆయన స్థానంలో రామచంద్ర మోహన్‌ను నియమించిన విషయం విదితమే. అన్నవరం దేవస్థానం ఈఓ పోస్టు జాయింట్ కమిషనర్ హోదా కలిగినది. దీనికంటే రామచంద్ర మోహన్ హోదా ఎక్కువ. దీనికి వ్యక్తిగత కారణాలు కూడా తోడవడంతో ఇక్కడ చేరేందుకు ఆయన ఇష్టపడటం లేదని అంటున్నారు. దీంతో అన్నవరం దేవస్థానం ఈఓ పోస్టును అడిషనల్ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలా లేక మరో అధికారిని నియమించాలా అని ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా శ్రీకాళహస్తి ఈఓగా నియమితులైన ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఉదయం అన్నవరం దేవస్థానంలో రిలీవ్ అయి, విజయవాడ బయలుదేరి వెళ్లిపోయారు. రిలీవ్ అవడానికి అవసరమైన ఫైళ్లపై సంతకాలు చేసిన ఆయన.. మిగిలిన ఫార్మాలిటీస్ పూర్తి చేయడానికి అవసరమైన ఫైళ్లను విజయవాడ తీసుకురావాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. కార్తిక మాసం ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆదిశంకర మార్గ్, మల్టీ లెవెల్ పార్కింగ్, వనదుర్గ గుడికి నిర్మించిన రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు రక్షణగా రోడ్డు అంచున బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పలువురు సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు.



చిరు వ్యాపారి ఆత్మహత్య

సామర్లకోట: పట్టణానికి చెందిన చిరు వ్యాపారి నరాలశెట్టి చక్రధర్ (52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు స్థానిక గాంధీనగర్‌లో నివాసం ఉంటూ మాండవ్య నారాయణస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల వద్ద కొబ్బరి కాయలు, అరటి పండ్లు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య అనారోగ్యంతో బాధ పడుతూండటంతో భరించలేని చక్రధర్ బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చక్రధర్ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి వివాహమైన ఇద్దరు కుమారులున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ముమ్మిడివరం: కొత్తలంక పంచాయతీ చాకిరేవుకు చెందిన ఓ మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. గ్రామానికి చెందిన విత్తనాల సీతమ్మ (45)ను ఇంటి వద్ద గురువారం తాచుపాము కాటు వేసింది. తొలుత ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సీతమ్మ మృతి చెందింది. కాటు వేసిన తాచుపాము ఇంట్లోనే ఉందని సమాచారం ఇవ్వడంతో స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ ఆ పామును పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

మాకు ప్రాధాన్యం ఏదీ?

- టీడీపీ, జనసేన ఆత్మీయ వేదికపై మమ్మల్ని దూరం పెట్టారు
- జనసేన ముస్లిం నాయకుల ఆవేదన

అమలాపురం టౌన్: బోడసకుర్రు ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహణపై వర్గ విభేదాల పొగ కమ్ముకుంది. అప్పటికే జనసేనలోని ఓ వర్గం నాయకులు.. టీడీపీకి చెందిన మరికొందరు నాయకులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. దీనికితోడు జనసేన పార్టీకి చెందిన అమలాపురం పట్టణ నాయకులు కొందరు ఆత్మీయ సమావేశంలో తమను దూరంగా పెట్టారని, వేదిక పైకి పిలవకుండా అవమానించారని ఆరోపించారు. ఆ సమావేశంలో ముస్లిం నాయకులకు జరిగిన అవమానంపై జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొహబూబ్ షరీఫ్ తన మిత్ర గ్రూపుల్లో బుధవారం రాత్రి పోస్టులు పెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన జనసేన ముస్లిం నాయకులు కొందరు ఆ సమావేశానికి వెళ్లినప్పటికీ వేదిక పైకి పిలవకుండా దూరం పెట్టారని షరీఫ్ గురువారం మధ్యాహ్నం మీడియా వద్ద ఆరోపించారు. ఆ వేదికపై ముస్లిం టీడీపీ నాయకులకు కూడా చోటు దక్కలేదని పేర్కొన్నారు. ఇలా రెండు పార్టీల ముఖ్య నాయకులూ ముస్లిం నాయకులకు స్థానం కల్పించకపోవడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు కరీముల్లా బాబా, షఫీ, మున్నార్ ఇదేవిధంగా ఆవేదన వ్యక్తం చేశారు.

నిస్సాన్ నూతన కారు ఆవిష్కరణ



నిస్సాన్ మ్యాగ్నైట్ ఇ-జెడ్ షిఫ్ట్ ఆటోమేటిక్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కంటిపూడి సర్వారాయుడు

రాజమహేంద్రవరం రూరల్: నిస్సాన్ మ్యాగ్నైట్ ఇ-జెడ్ షిఫ్ ఆటోమేటిక్ కారును రాజమహేంద్రవరం కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంటిపూడి నిస్సాన్ షోరూములో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆటోమేటిక్, మేన్యువల్‌గా డ్రైవ్ చేయగలగడం ఈ కారు ప్రత్యేకత అని చెప్పారు. 360 డిగ్రీల కెమెరా, 8 అంగుళాల టచ్ స్క్రీన్, బై ప్రొజెక్టర్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, 250 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, 16 అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ తదితర అనేక ఆధునిక ఫీచర్లు ఈ కారులో ఉన్నాయని తెలిపారు. దీని ధర రూ.6.49 లక్షలని చెప్పారు. కార్యక్రమంలో కంటిపూడి డైరెక్టర్లు కె.వినయ్ బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చిన్నబాబు), కె.మన్మోహన్‌రామ్, జీఎం ఎంఎస్ సూర్య, ఎస్ఎం హరి, నగర ప్రముఖులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా అధికారులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని డ్వామా పీడీ, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. డ్వామాలో రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, పోషక విలువలు కలిగిన మొక్కలు నాటించడంపై మూడో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు మొదటి బ్యాచ్‌లో 52 మంది హాజరయ్యారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ, శిక్షణను డ్వామా అధికారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మొత్తం తొమ్మిది బ్యాచ్‌లలో 11 జిల్లాల నుంచి వచ్చిన 343 పీడీలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చామని, దీంతో డ్వామా అధికారుల శిక్షణ పూర్తయిందని తెలిపారు. శిక్షణ పొందిన వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. మూడో రోజు ఫ్యాకల్టీలు శ్రీదేవి, నిహారిక, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, ఎస్‌కే మొహిద్దీన్, జీఎస్ఆర్ ఆంజనేయులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కృష్ణమోహన్ సర్టిఫికెట్లు అందజేశారు.



శిక్షణ పూర్తి చేసుకున్న డ్వామా అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు

గిడ్డి ఈశ్వరికి తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన గిడ్డి ఈశ్వరి కారు

శంఖవరం: పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి త్రుటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీని అదే మార్గంలో ఆమె ప్రయాణిస్తున్న కారు శంఖవరం మండలం సీతంపేట వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బాగా దెబ్బ తింది. ఎటువంటి గాయాలూ కాకుండా ఈ ప్రమాదం నుంచి ఈశ్వరి క్షేమంగా బయట పడ్డారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రముఖులు

రామచంద్రపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సీహెచ్ ఐశ్వర్యాంబిక ఎంపికై ంది. ఈమెతో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థిని డి.అపర్ణ, తొమ్మిదో తరగతి విద్యార్థి సీహెచ్ బాలప్రసాద్‌లు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ జి.మామిడాడలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. వీరిలో ఐశ్వర్యాంబిక వచ్చే నెలలో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికై ందని ప్రధానోపాధ్యాయుడు టి.వీరరాఘవరెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, ఆలిండియా సెక్రటరీ గన్నమని చక్రవర్తి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.విజయకృష్ణ, హెచ్‌ఎం వీరరాఘవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



తాటిని తలదన్నేలా..

తాటిచెట్టును తలదన్నేలా ఎదిగేస్తోంది ఆ బొప్పాయి చెట్టు. సాధారణంగా బొప్పాయి చెట్టు 10 నుంచి 15 అడుగుల ఎత్తుకు ఎదుగుతుంది. కానీ, రాజానగరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఈ చెట్టుకు లభించే పోషకాలు ఏమిటోగాని అంతకు రెట్టింపు.. అంటే సుమారు 30 అడుగుల ఎత్తుకు ఎదిగి, చూపరులను ఆకర్షిస్తోంది. అంతేకాదు.. ఈ చెట్టుకు కాస్తున్న కాయలు కూడా తగినంత పరిమాణంలో ఉండటం విశేషం. అందరినీ ఆకట్టుకుంటున్న ఈ బొప్పాయి చెట్టు వద్ద పలువురు విద్యార్థులు ఫొటోలు కూడా తీసుకుంటున్నారు.

– రాజానగరం

ధాన్యం కొనుగోలులో రోజువారీ చెల్లింపులు

పౌర సరఫరాల ఎండీ వీరపాండ్యన్

సామర్లకోట: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రోజువారీ చెల్లింపులు జరపడానికి చర్యలు తీసుకుంటున్నామని పౌర సరఫరాల ఎండీ వీరపాండ్యన్ అన్నారు. మండలంలోని పీబీ దేవం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలులో సమస్యలను పూర్తిగా అధిగమించాలని సూచించారు. పొలం నుంచి మిల్లుకు రైతు వెళ్లిన సమయంలో జాప్యం లేకుండా రైతు భరోసా కేంద్రం నుంచే మానిటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం విక్రయించిన మర్నాడే రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని వీరపాండ్యన్ చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లా పౌర సరఫరాల అధికారి దుర్గాప్రసాద్, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ పుష్పమణి, డీఎస్ఓ ఎండీ ప్రసాద్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



పీబీ దేవంలో రైతులతో మాట్లాడుతున్న వీరపాండ్యన్